సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 23 । నవంబర్ । 2024



కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

విధుల్లో అలసత్వం వహిస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మదనపల్లి డీఎల్‌పీఓ కే.నాగరాజు తెలిపారు. -8లో



తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి డిమాండ్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.380
రెండోరకం	రూ.230	రూ.336

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 283 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కిడ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో ట్యాలీ ప్రైమ్, జీఎస్టీ అడ్వాన్స్, ఎక్సెల్ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం, ఎంకాం ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు 20–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. విజయవాడలో 45 రోజులపాటు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

రాయలసీమలోని సంస్థలను అమరావతికి తరలించరాదు



మాట్లాడుతున్న రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాయలసీమలో ఉన్న సంస్థలను అమరావతికి తరలించరాదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి, లోకయుక్త, మానవ హక్కుల కమిషన్, ఇక్కడే ఉంచిన విధంగా ఏపీజీబీ, ఇతర సంస్థలను రాజధాని అమరావతికి తరలించటం లేదని చెప్పాలన్నారు. కార్యక్రమంలో, ఆర్‌సీపీ నగర కార్యదర్శి, మగ్బుల్ బాషా, మదగలం ప్రసాద్, పాల్గొన్నారు.

యాంత్రిక జీవన శైలితోనే ప్రమాదకర వ్యాధులు



విషజ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

కలకడ: యాంత్రిక జీవన శైలితోనే ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ఎగువబట్టావారిపల్లె, బొజ్జగుంటపల్లె లో నిర్వహిస్తున్న ఎన్‌సిడి 3.0 (అసంక్రమిత వ్యాధులు)సర్వేని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అసంక్రమిత వ్యాధులు అయిన క్యాన్సర్, షుగర్, బీపీ, థైరాయిడ్, గుండెజబ్బులు, ఊబకాయం వంటి జబ్బులు ఈ మధ్యకాలంలో ఎక్కువగా వస్తున్నాయని వీటికి ముఖ్యకారణం మారుతున్న జీవనశైలి, యాంత్రిక జీవనానికి అలవాటుపడటం అని అన్నారు. సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ జ్వరాల వ్యాప్తి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామక్రిష్ణ, ఎంపీహెచ్‌ఓ జయరామయ్య, సిబ్బంది రాజసులోచన, వరలక్ష్మి పాల్గొన్నారు.

వీరి వీరి గుమ్మాడి...



బడికిరాని వారెక్కడో వెతకండి..

- జిల్లాలో 5,072 మంది బడికి రాని పిల్లలు
- వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు అన్వేషణ బాధ్యతలు
- గడువు ముగుస్తున్నా తేలని విద్యార్థుల లెక్కలు
- అపార్‌తో మరింత ఆలస్యం అవుతున్న అన్వేషణ



జిల్లా విద్యాశాఖ కార్యాలయం, రాయచోటి

రాయచోటి: కూటమి ప్రభుత్వంలో సాఫీగా జరిగిపోతుందనుకున్న విద్యాశాఖకు నేడు పెద్ద చిక్కు సమస్య వచ్చి పడింది. సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమానికి అనుకున్న స్థాయిలో స్పందన లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి విద్యార్థుల రోజువారీ హాజరును ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు పంపుతారు. వరుసగా 29 రోజులు బడికి రాని పిల్లల పేర్లు డ్రాప్‌బాక్స్‌లో చేరతాయి. తిరిగి వారు హాజరైతే డ్రాప్‌బాక్స్ నుంచి తొలగిస్తారు. యూడైస్‌లో పేర్లు నమోదైనప్పటికీ, కొందరు పిల్లలు బడికి రావడం లేదన్న సమాచారం ఉంది.

- నూతన ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇస్తామన్న తల్లికి వందనం నిధులు చెల్లించక పోవడంతో డ్రాప్‌బాక్స్‌లో వారి సంఖ్య మరింత పెరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిలో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు బడికి రాకుండా కుటుంబ సభ్యులకు తోడుగా ఉపాధి వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. దాంతో వారి పేర్లు అలాగే డ్రాప్‌బాక్స్‌లో కనిపిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఈ లెక్కలు తీయగా అన్నమయ్య జిల్లా అందులో 6 వ స్థానంలో ఉన్నట్లు ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం జిల్లా వ్యాప్తంగా డ్రాప్‌బాక్స్‌లో ఉన్న వారి సంఖ్య 5,072 గా ఉంది. దీంతో వీరి వివరాలు గుర్తించి బడిలో చేర్పించేలా చూడాలని ఉన్నతాధికారులు దిగువ స్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల కోసం చేస్తున్న అన్వేషణకు ప్రభుత్వం ఈ మధ్యకాలంలో తలపెట్టిన అపార్ కార్యక్రమంతో మరింత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ముందుగా అపార్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి వచ్చిన సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులను ఆదేశించడంతో అన్వేషణ ఆలస్యం అవుతున్నట్లు తెలియవచ్చింది.



నమోదులోనూ తప్పులు: జిల్లాలో గత నెల రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఏ రోజు సమాచారాన్ని ఆ రోజు డైరెక్టర్ కార్యాలయానికి అధికారులు పంపుతున్నారు. సహేతుకమైన కారణాలు ఉంటే ఆయా పిల్లల పేర్లు రాష్ట్ర కార్యాలయంలోనే డ్రాప్ బాక్స్ నుంచి తొలగిస్తున్నారు. ఇలా బుధవారం నాటికి 4వేల మంది విద్యార్థుల లెక్కలను తేల్చగా మరో వెయ్యి మందికి పైగా విద్యార్థుల లెక్క తేల నట్లు సమాచారం ఉంది. సాధ్యమైనంత వరకు మిగిలిన వారి వివరాలను కూడా మరో రెండు, మూడు రోజుల్లో తేల్చాలని ఉన్నతాధికారులు బృందం సభ్యులకు సూచిస్తున్నారు. ఈ పేర్లలో కొన్ని డబుల్ ఎంట్రీలున్నట్లు గుర్తించారు. విద్యార్థి బడిలో చేరినప్పుడు ఆధార్ కార్డు లేకపోతే తొమ్మిది అంకెలు 12 వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. సొంత ఆధార్ నంబర్ వచ్చాక ఆ సంఖ్యతో మళ్లీ నమోదు చేయనున్నారు. ఈ సమయంలో దొర్లిన పొరపాట్లతో రెండు సంఖ్యలపై ఒకే పేరు ఉన్నట్లు బృందం సభ్యులు గుర్తిస్తున్నారు.

బృందాలతో సేకరణ...

డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థులు ప్రస్తుతం ఎక్కడున్నారు..? వేరే పాఠశాలలలో, కళాశాలలలో ఏమైనా చదువుతున్నారా..? లేదంటే వలస వెళ్లారా..? ఇంకా ఏదేని సమస్యలున్నాయా.? అన్న విషయాలను పూర్తిగా క్రోడీకరించి పంపాలని కోరారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఆర్పీలు, వెల్ఫేర్ సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి సేకరణ చేపట్టారు. ఈ సేకరణ సమయం దగ్గరపడుతున్నా పూర్తిస్థాయిలో డ్రాప్‌బాక్స్‌లో ఉన్న వారి లెక్కలు కొలిక్కి రాలేదన్న సమాచారం.

- జిల్లాలో 414 మంది సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, 142 మంది క్లస్టర్ రిసోర్స్ (సిఆర్పీ) పర్సన్లకు ఈ బాధ్యత అప్పగించారు. వారు ఇచ్చే సమాచారంతో పాటు తమ వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి ఆ పరిధిలోని పాఠశాల హెచ్‌ఎంల ద్వారా సమగ్ర శిక్షా కార్యాలయానికి 15 రోజుల్లో వివరాలు పంపాల్సి ఉంది. తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ కూడా సేకరించాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఇటీవల అందరు డీఈవోలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. గడువు సమయం దగ్గర పడుతున్నా పూర్తిస్థాయిలో విద్యార్థుల సమాచారం అందడం లేదని బృందం సభ్యులు చెబుతున్నారు.

కనిపించని చిరునామా

దాదాపు పదేళ్లుగా కొందరు విద్యార్థుల పేర్లు డ్రాప్‌బాక్స్‌లో కొనసాగుతున్నా వారి అడ్రస్సుల సేకరణలో అధికారుల శ్రమకు ఫలితం కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీరిలో కొందరికి వివాహాలు కావడం, మరికొందరు ఇతర రాష్ట్రాలకు వలసపై వెళ్లడం, ఇంకొద్ది మంది మృతి చెందడం వంటి కారణాలు ఉన్నట్లు సమాచారం వస్తోందని పేర్కొంటున్నారు. ఎవరైనా బడిఈడు పిల్లలు బడి బయట ఉంటే వారిని వెంటనే బడిలో చేర్చాలని అధికారులు ఆదేశాలిస్తున్నారు. అయినా ఇప్పటి వరకు ఎవరినీ తిరిగి చేర్చిన దాఖలాలు లేవు. ఇప్పుడు వారిని వెతికి పట్టుకున్నా బడికి రారని, ఆర్థిక, కుటుంబ సమస్యల వల్ల వారు చదువు మానేసినట్లు కొందరు హెచ్‌ఎంలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డ్రాప్‌బాక్స్‌లో ఉన్న వారిలో ఎక్కువ మంది 8 నుంచి 12 తరగతులలో చదువులు మానేసిన వారే ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



సుండుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

సుండుపల్లె: ప్రభుత్వం వివిధ పథకాలలో నిర్దేశించిన లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వద్దని, చట్టప్రకారం పీజీఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సుండుపల్లి ఎంపీడీఓ కార్యాలయాలలో సీఎంఓ, పీజీఆర్‌ఎస్ దరఖాస్తులు, విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఇళ్ల నిర్మాణ ప్రగతి, ఎస్‌సీపీఐలో బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింక్ తదితర అంశాలలో తహశీల్దార్లు, ఎంపీడీఓలు, డీటీలు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం టి సుండుపల్లిలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించి అక్కడి పిల్లలకు భోజనం వడ్డించారు. అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

వీరబల్లి: ప్రజలు గ్రీవెన్స్‌లో అందజేసిన దరఖాస్తులపైన విచారించి నిష్పక్షపాతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన వీరబల్లి మండలాన్ని సందర్శించి అన్నిశాఖల అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాయచోటి : రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్లు, జిల్లాలోని తహసీల్దార్లతో పీజీఆర్‌ఎస్ ద్వారా అందిన అర్జీలు, సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలు తదితర అంశాలపై కలెక్టర్ శ్రీధర్ సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల కు భూసేకరణ, ఈ ఆఫీస్ అమలు అంశాలపై తగు సూచనలు చేశారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి పాల్గొన్నారు.

నేతల మాటలకు అర్థాలే వేరులే!

ఆడవారి మాటలకు అర్థాలే వేరులే...అంటూ ఓ సినిగేయ రచయిత పాట రచించారు. వాస్తవానికి ఆ స్థానంలోకి రాజకీయ నాయకులు వచ్చి చేరిపోయారు. వారి మాటలకు చేష్టలకు పొంతన లేకుండా ఉంది. 'నోటితో మాట్లాడడం, నొసలుతో వెక్కిరించడం, దేని పని దానిదే'అన్నట్లుగా ఉండిపోయింది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు అదే విషయాన్ని రూఢీ చేస్తున్నాయి.

- రిత్విక్ సంస్థపై దాడి చేసినా నోరు మెదపని ఎంపీ రమేష్‌నాయుడు
- రెచ్చిపోయి ఊగిపోతున్న ఎమ్మెల్యే ఆది
- ఆఫై వైఎస్సార్‌సీపీ నేతల పనులంటూ..డొంకతిరుగుడు మాటలు
- ఎమ్మెల్యే మాధవీరెడ్డి సైతం మద్యం షాపుపై అసెంబ్లీలో ప్రస్తావన
- అన్నింటా పాత్రధారులు... సూత్రధారులు కూటమి నేతలే



సాక్షి ప్రతినిధి, కడప: జిల్లాలో ఆదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతోంది. కొండాపురం మండలంలోని దొబ్బుడుపల్లె, రావికుంట, తిరువాలయపల్లె గ్రామాలతోపాటు మైలవరం మండలంలోని బొగ్గులపల్లె గ్రామాల పరిధిలో ఆ పనులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనులన్నీ తమ వర్గీయులే చేపట్టాలంటూ జమ్మలమడుడు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పట్టుబట్టారు. మంతనాలు, హెచ్చరికలు, రాయబేరాలు ఎలా నడిపినా, ఆశించిన తీరులో నిర్మాణ పనులు దక్కలేదు. దీంతో ఎమ్మెల్యే ఆది కుటుంబ సభ్యులు శివనారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డిల నేతృత్వంలో దొబ్బుడుపల్లె వద్ద చేపడుతున్న నిర్మాణపనుల్లో విధ్వంసం సృష్టించారు. స్థానికంగా ఉన్న రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బందిపై దాడి చేసి, అక్కడే ఉన్న వాహనాలను పగులగొట్టారు.



రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్ ఇంజినీర్లపై దాడి చేస్తున్న ఎమ్మెల్యే ఆది వర్గీయులు (ఫైల్)



క్షేత్రస్థాయిలో రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పనులు అడ్డుకొని స్థానికంగా ఉన్న సైట్ ఇంజినీర్లపై ఎమ్మెల్యే ఆది వర్గీయులు దాడి చేస్తే ఎంపీ రమేష్ నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు నోరు మెదపలేదు. తెరవెనుక మంత్రాంగంలో రమేష్‌నాయుడు ఉండిపోయారని సమాచారం. ఆమేరకు తన సోదరుడు రాజేష్‌నాయుడును సీఎం వద్దకు పంపించి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

తెరవెనుక మంత్రాంగంలో సీఎం రమేష్‌నాయుడు

సీఎం స్థాయిలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు దాడి చేపట్టిన వ్యవహారంపై వాకబు చేయడంతో వైఎస్సా ర్‌సీపీ నాయకులతో కలిసి పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆది చెప్పుకొచ్చారు. అదే వాస్తవమైతే ఫలానా వైఎస్సార్‌సీపీ నాయకులు పనులు చేస్తున్నారని, వారు అక్కడే ఉండి రెచ్చగొట్టారని ఎందుకు బహిరంగంగా ప్రకటించలేదని విశ్లేషకులు నిలదీస్తున్నారు. రూ.1800 కోట్ల సివిల్ పనులు రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ ఎలా ఇస్తారన్నదే ఎమ్మెల్యే వర్గీయుల అసలు ప్రశ్న. ఆ పనులు తామే చేయాలన్నదే వారి ఆకాంక్ష. ఆ విషయాన్ని తెరమరుగు చేసి, వైఎస్సార్‌సీపీ నేతల పనులంటూ దాడి వ్యవహారాన్ని ఎమ్మెల్యే ఆది రక్తి కట్టించారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

గళమెత్తిన రెడ్డెమ్మ...



ఎమ్మెల్యే మాధవీ రెడ్డి కడపలో మద్యం షాపుల నిర్వహణ తీరుపై అసెంబ్లీలో గళమెత్తారు. మార్పు పేరిట డీ–అడిక్షన్ సెంటర్ మేడపైన నిర్వహిస్తుంటే, ఆ బిల్డింగ్ కిందనే మద్యం షాపు ఏర్పాటు చేశారని చెప్పుకొచ్చారు. వాస్తవంగా ఎమ్మెల్యే లేవనెత్తిన ప్రశ్న మంచిదే అయినా, ఈ వ్యవహారంలో పాత్రధారులు, సూత్రధారులను బహిరంగ పర్చి ఉంటే బాగుడేందని పలువురు చెప్పుకొస్తున్నారు. కడపలో రెడ్డి వైన్స్ వర్సెస్ మౌర్య వైన్స్ మధ్య పెద్ద ఎత్తున ఆధిపత్య పోరాటం నడిచిన విషయం జగమెరిగిన సత్యం. అక్కడ మౌర్య వైన్స్ ఉంచరాదనే విషయంపై అధికారులపై రాజకీయ ఒత్తిడులు వచ్చినా అక్కడే కొనసాగిస్తున్నారంటే మరో అధికార పార్టీ నేత ప్రమేయం ఉండడమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది వ్యవహారంలోనైనా, ఇటు కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అసెంబ్లీలో గళమెత్తినా ఈ వ్యవహారంలో పాత్రధారులు కూటమి ప్రభుత్వ నేతలేనన్నది సుస్పష్టం.




సాహితీ వనంలో.. ఉర్దూ సుగంధం

- నేడు మదనపల్లెలో అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం


మదనపల్లె సిటీ: కవులు, సాహిత్యపరంగా ఖ్యాతి గాంచిన అన్నమయ్య జిల్లాలో తెలుగుతో పాటు ఉర్దూ సాహిత్యమూ పరిమళిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి దాటి ప్రపంచ స్థాయిలో సాహితీ వెలుగులు పంచుతోంది. కవి సమ్మేళనాలు, సాహితీ సదస్సులు, కవితలు, పాటలు, వ్యాసాలు, నాటకాలు ఇలా పలు అంశాలలో జిల్లాకు చెందిన రచయితలు, కవులు, సాహితీవేత్తలు తమ సాహిత్యప్రతిభను చాటుతున్నారు. నేడు (శనివారం) మదనపల్లెలో జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్న సందర్భంగా జాతీయ స్థాయిలో ఉర్దూ సాహిత్యానికి ఆయువుపట్టుగా నిలుస్తున్న జిల్లాలోని పలువురు కవులు, సాహితీవేత్తల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.....

బాబా ఫకృద్దీన్..




మదనపల్లె పట్టణం దేవళం వీధికి చెందిన అత్యంత సాదాసీదాగా కనిపించే బాబా ఫకృద్దీన్ (ఖమర్ అమీనీ) పరిచయం అవసరం లేని ప్రసిద్ధ ఉర్దూ కవి. రాయలసీమలో ఉర్దూ కవి సమ్మేళనాల నిర్వహణలో ఈయన పాత్ర మరువలేనిది. ఈయనకు ఉర్దూ కవిత్వంలో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. 40 సంవత్సరాల పాటు హిందీ, ఉర్దూ ఉపాధ్యాయునిగా పని చేసి పదవీ విరమణ చెందిన ఈయన జాతీయస్థాయిలో వేలాది ఉర్దూ కవి సమ్మేళనాల్లో పాల్గొన్నారు. ఉర్దూలో ఈయన రచించిన తవాఫ్–ఏ–గజల్, నాత్‌కీ అంజుమన్, కష్కోల్–ఏ–ఖల్బ్–ఓ–నజర్, కష్కోల్–ఏ–కరమ్, ఇర్తికాజ్–ఏ–అఫ్కార్ కవితా సంపుటాలు జాతీయస్థాయిలో పలువురి మన్ననలు పొందాయి. రాష్ట్ర ఉర్దూ అకాడమీతో పాటు పలు సంస్థల ద్వారా ఈయన అనేక పురస్కారాలు అందుకున్నారు. ఈయన పలు కవితలు, విమర్శనాత్మక వ్యాసాలు, గజల్స్ రాశారు. ఆయన సాహిత్యంపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు.

పఠాన్ మహమ్మద్‌ఖాన్..



పఠాన్ మహమ్మద్‌ఖాన్ కలం పేరు జోహర్. మదనపల్లె పట్టణానికి చెందిన ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. పాఠశాల దశ నుంచే ఉర్దూ భాషపై మక్కువ పెంచుకున్న ఈయన నిరంతరం ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఉర్దూ సాహిత్యంలో పలు గజల్స్, హమ్డ్, నాత్‌లు రాశారు. ఉర్దూ కవి సమ్మేళనాలకు కన్వీనర్‌గా, రూటా రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. జిల్లాలో ఉర్దూ పాఠశాలల స్థాపన, ఉన్నతీకరణకు అటు ప్రభుత్వం ఇటు అధికారులతో ప్రాతినిధ్యం చేసి భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. సర్వశిక్ష అభియాన్‌లో ఉర్దూ అకడమిక్ మానటరింగ్ అధికారిగా పని చేస్తూ ఉర్దూ విభాగంలో సేవలను అందించారు. ఉర్దూ సాహిత్యాభివృద్ధి, భాషాభివృద్ధికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ ద్వారా ఈయనను గత ఏడాది లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది.

షేక్ జాఫరుద్దీన్..




లక్కిరెడ్డిపల్లె మండలం నీల కంఠరావుపేటకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జాఫరుద్దీన్ ప్రముఖ ఉర్దూ కవి. కలం పేరు జాఫర్. గత పది సంవత్సరాలుగా ఉర్దూ కవిగా, గాయకుడిగా వందల సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొని ఉర్దూ భాషకు ఎనలేని సేవలు అందించారు. ఇటీవల ఉర్దూ అకాడమీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. అజాద్ ఎడ్యుకేషనల్, మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు.

సబాతుర్ రహమాన్..



రాయచోటికి చెందిన సబాతుర్ రహమాన్ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ఈయన రాయచోటి పట్టణంలోని మార్కెట్‌వీధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. రూటా ఉర్దూ ఉపాధ్యాయ సంఘానికి జిల్లా అధ్యక్షునిగా కూడా ఉంటూ ఉర్దూ భాషలో సబాత్ కలం పేరుతో అనేక గజల్స్, నాత్, హమ్డ్‌లు రాశారు. ఉర్దూ భాషకు ఎనలేని సేవలు అందించారు.

డాక్టర్ నఖీవుల్లాఖాన్..



గుర్రంకొండకు చెందిన డాక్టర్ నఖీవుల్లాఖాన్ యువ ఉర్దూ కవిగా పేరు తెచ్చుకున్నారు. నఖీ ఆయన కలం పేరు. పలు కథలు, గజల్స్, నాత్, హమ్డ్‌లు రాశారు. ముఖ్యంగా ఉర్దూలో సాహిత్య అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. జాతీయస్థాయిలో అనేక ఉర్దూ కవి సమ్మేళనాల్లో పాల్గొని పలు ప్రశంసలు పొందారు. ఉర్దూ సాహిత్యంలో ఈయన చేసిన సేవలు, పరిశోధనలకుగాను శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. అలాగే ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఉర్దూ అకాడమీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుతో సత్కరించింది.

తఖీవుల్లాఖాన్..



గుర్రంకొండకు చెందిన తఖీవుల్లాఖాన్ వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. తఖీ కలం పేరుతో ఉర్దూలో అనేక గజల్స్, నాత్, కవితలు రాశారు. జాతీయ స్థాయిలో అనేక ఉర్దూ కవి సమ్మేళనాల్లో పాల్గొని కవితాగానం చేసి గుర్తింపు పొందారు. ఉర్దూ సెమినార్లు, సదస్సులలో పాల్గొని అనేక ప్రశంసలు పొందారు.

రియాజుద్దీన్ హుస్సేని..



రాయచోటికి చెందిన రియాజుద్దీన్ హుస్సేని ప్రముఖ ఉర్దూ కవి. రజీ కలం పేరు. బజ్మే హుస్సేని సంస్థను స్థాపించి వందల సంఖ్యలో ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహించారు. ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అనేక గజల్స్, నాత్, హమ్డ్‌లు రాశారు. ఉర్దూ భాషకు సేవలు అందిస్తున్నారు.

షీన్‌మీమ్ హాషిం ..



అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన షీన్‌మీమ్ హాషిం వృత్తిరీత్యా ఉర్దూ ఉపాధ్యాయుడు. తలీఖ్ కలం పేరుతో అనేక ఉర్దూ హమ్డ్, నాత్, గజల్స్ రాశారు. జాతీయ స్థాయిలో జరిగే ఉర్దూ కవి సమ్మేళనాలలో వ్యాఖ్యాతగా పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో అనేక పురస్కారాలను అందుకున్నారు. ప్రస్తుతం ఆయన రాజంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ పండితుడిగా పని చేస్తున్నారు.

ఇమామ్ ఖాసీం..



ఇమామ్ ఖాసీం కలం పేరు సాఖి. లక్కిరెడ్డిపల్లెలో ఇంగ్లీషు టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయన వందలాది హమ్డ్, నాత్, గజల్స్ రాశారు. ఇప్పటి వరకు ఆయన రాసిన అబ్సార్–ఏ–సఖున్, ఫిక్ర్–ఓ–ఫన్–కే ఫూల్ ఉర్దూదోహా కవితా సంపుటాలు దేశ వ్యాప్తంగా మన్ననలు పొందాయి. ఉర్దూ కవిత్వం, సాహిత్యాభివృద్ధి కోసం ప్రతి నెలా బజ్మ్–ఏ–సాఖియేఖున్ పేరుతో రాయచోటిలో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

కవి సమ్మేళనం జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముషాయిరా కమిటీ కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండులోని బడేమకాన్ దర్గా ఆవరణలో శనివారం రాత్రి అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ముషాయిరా కమిటీ కన్వీనర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కార్యదర్శి ఖమర్ అమీని తెలిపారు. శుక్రవారం దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కవి సమ్మేళనానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరుకానున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఉర్దూ కవులు కార్యక్రమంలో పాల్గొని మహా ప్రవక్త హజరత్ మహమ్మద్ జీవితంపై నాత్ ఏ షరీఫ్ పఠిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఉర్దూ భాషాభిమానులు, సాహితీప్రియులు హాజరుకావాలని కోరారు.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి, అధికార ప్రతినిధి కొరముట్ల



మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : తొలగించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ ఎండీసీ కార్యాలయంలో ఈ విషయంపై సీపీఓ సుదర్శన్ రెడ్డితో వారు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఇప్పుడు మూకుమ్మడిగా అందరినీ ఒకేసారి తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన వారికి మళ్లీ ఉద్యోగాలు ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి కూటమి ప్రభుత్వం పాపం మూటగట్టుకుందన్నారు. స్థానికంగా ఇల్లు, భూములు కోల్పోయిన వారు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారన్నారు. ఇది వారి హక్కు అన్నారు. ఎవరో చెప్పారని పనిచేస్తున్న ఉద్యోగులను ఎలా తొలగిస్తారని సీపీఓను ఆయన ప్రశ్నించారు. మంగంపేటను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దాదాపు రూ. 400 కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని, మూడు గ్రామాలు తరలించడమే కాక అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పునరావాసం కల్పించారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సహకారంతో వందలాది మిల్లులు ఏర్పాటు చేసి వేలాది మందికి జీవనోపాధి కల్పించారన్న విషయం గుర్తు చేశారు. యువగళంతో ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి నారాలోకేష్ హామీ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వకపోగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడవేశారని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పునరావాస కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించారని, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఇప్పటికీ రాజంపేట ఎంపీగా ఉన్నారని కనీసం ఆయనకు తెలియకుండా ఉద్యోగాలను ఎలా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, పుల్లంపేట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముస్తాక్, నాయకులు శివారెడ్డి, ఆర్‌వీ రమణ, గల్లా శ్రీనివాసులు, దాము, రఘు, తొలగించిన ఉద్యోగులు, వైఎస్సార్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

- నెలాఖరులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలి
- డీఎల్‌పీఓ కే.నాగరాజు



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

పెద్దతిప్పసముద్రం : విధుల్లో అలసత్వం వహిస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మదనపల్లి డీఎల్‌పీఓ కే.నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామ పంచాయతీల డిజిటలైజేషన్ విషయంలో సచివాలయ సిబ్బందికి పంచాయతీరాజ్ కమిషనర్ సమగ్రంగా ఆదేశాలు ఇచ్చినా కూడా కొంత మంది సిబ్బంది నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో బి.కొత్తకోట మండలంలోని గట్టు, వేమిలేటికోట, గుమ్మసముద్రం, నాయనబావి పంచాయతీల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. మదనపల్లి డివిజన్ పరిధిలోని 251 గ్రామ పంచాయతీల పరిధిలో 1.88,464 గృహాలు డిజిటలైజేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 17,523 గృహాలను మాత్రమే పూర్తి చేశారన్నారు. సిబ్బంది సేకరించిన ప్రాథమిక సమాచారాన్ని ఈ నెలాఖరులోగా స్వచ్ఛ గ్రామ పంచాయతీ పోర్టల్‌లో సమగ్రమైన వివరాలను అప్‌లోడ్ చేసేలా ఆదేశాలిచ్చామన్నారు. సచివాలయాల్లో నగదు రహిత లావాదేవీలను నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సిబ్బంది కొరత ఉన్న గ్రామాల్లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజల సూచనల మేరకు రంగసముద్రం చేపల చెరువుకు వేలం నిర్వహిస్తామని డీఎల్‌పీఓ వెల్లడించారు. ఆయన వెంట ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జిల్లా స్థాయి త్రోబాల్ క్రీడాకారుల ఎంపిక

ఓబులవారిపల్లె : ఎస్‌జీఎఫ్ వైఎస్సార్ కడప జిల్లా త్రోబాల్ అండర్–17, 14 బాల బాలికల జిల్లాస్థాయి ఎంపికలను శుక్రవారం ముక్కావారిపల్లె ఆర్‌ఎస్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు, 25 మంది వ్యాయామ ఉపాధ్యాయులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ వైఎస్సార్ కడప జిల్లా సెక్రటరీ అరుణ కుమారి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో త్రోబాల్ పోటీలకు అండర్–14, 17 బాలురు బాలికల క్రీడాకారులకు సంబంధించి 200 మంది పాల్గొనగా 24 మంది బాలురు, 24 మంది బాలికలు చొప్పున మొత్తం 48 మంది ఎంపికైనట్లు తెలిపారు. అండర్ 14 చిత్తూరు జిల్లాలో, అండర్–17 గుంటూరు జిల్లాలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీ టి ఆంజనేయరాజు, ప్రిన్సిపాల్ ఏపీఆర్‌ఎస్ బి ఆంజనేయరాజు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ భాస్కర్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న బాలరంగ్ జానపద నృత్యపోటీలు

రాయచోటి టౌన్ : ఈనెల 26వ తేదీన రాయచోటి డైట్ కళాశాల ఆవరణంలో బాలరంగ్ జిల్లా స్థాయి జానపద నృత్యపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ , రాష్ట్ర విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జానపద కళాకారులు తప్పెటగూళ్లు, కర్రసాము, చెంచుల వేట, తింస, జాలరి, బంజారా వంటి జానపద నృత్యాలను ప్రదర్శించవచ్చున్నారు. నృత్య, గాత్ర, వాయిద్యనైపుణ్య గల విద్యార్థులు ఒక సమూహంగా ఏర్పడి 15 మందికి మించకుండా ప్రదర్శన ఇవ్వాలన్నారు. జిల్లా జట్టు తమ ప్రాంతంలోని సంప్రదాయ జానపదాలను ప్రదర్శించాలని సూచించారు. గత బాలరంగ్‌లో పాల్గొన్న జట్లు అనర్హులని తెలిపారు. విద్యార్థులు తప్పకుండా గుర్తింపు కార్డు పొంది ఉండాలని చెప్పారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఒక జట్టు మాత్రమే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల వివరాలు డైట్ కళాశాల అధ్యాపకుడు అసదుల్లా బాషా మొబైల్ 9440084715 నంబర్‌కు వాట్సాప్‌కు పంపాలని సూచించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

– సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్



సబ్ కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రైతులు

పెద్దమండ్యం : భూ సమస్యలతో కార్యాలయానికి వచ్చే రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. మండలంలోని శివపురం, పెద్దమండ్యం గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. శివపురంలో రీసర్వే జరిగిన భూముల్లో ఉన్న సర్వే రాళ్లను పరిశీలించారు. శివపురం, శిద్దవరం గ్రామాలలో జరిగిన రీసర్వేపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం వద్ద పలువురు రైతులు వారి సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అర్జీలను పరిశీలించిన సబ్ కలెక్టర్ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పెద్దమండ్యం గ్రామం రెడ్డివారిపల్లె దళితవాడ వద్ద , దళితులు వేసుకున్న గొర్రెలు, మేకల దొడ్లపై రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, వీఆర్‌వో, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

టౌన్‌బ్యాంక్ పాలకవర్గానికి 12 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న నాదెళ్ల విద్యాసాగర్

మదనపల్లె : ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కానుంది. పాలకవర్గానికి ఎన్నుకోవాల్సిన సభ్యుల సంఖ్య 12 కాగా, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన నామినేషన్ల స్వీకరణలో 12 మంది సభ్యులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో టౌన్‌బ్యాంక్ పాలకవర్గ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక లాంఛనం కానుంది. టౌన్‌బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ ఆధ్వర్యంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది. బ్యాంక్‌లోని 12 డైరెక్టర్ల స్థానాలకు నిమ్మనపల్లె ముక్తియార్‌ఖాన్, సూరె రవీంద్రనాథ్, నవరం భాస్కర్‌కుమార్, నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ సి.సోమశేఖర్, దిగువపాళ్యం నిరంజన్‌కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామ రవికాంత్‌బాబు, రామిశెట్టి భాస్కర్, ఆకులకృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్, జోలిపాళ్యం కృష్ణమూర్తి దేవేంద్రబాబులు నామినేషన్లు దాఖలు చేశారు. 12 స్థానాలకు కేవలం సింగిల్ నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ మాట్లాడుతూ..టౌన్‌బ్యాంక్ పాలకవర్గ సభ్యుల ఎన్నికకు సంబంధించి 12 నామినేషన్లు వచ్చాయన్నారు. శనివారం నామినేషన్ల స్క్రూటినీ చేస్తామన్నారు. 24న నామినేషన్ల ఉపసంహరణ, 25న ఆఫీస్ బేరర్ల ఎన్నిక జరుగుతుందన్నారు. అయితే ముందునుంచి అందరూ ఊహించినట్లుగానే టౌన్‌బ్యాంక్ పాలకవర్గ ఎన్నికల్లో ఇతరులు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయకుండా కూటమి నాయకులు పకడ్బందీ వ్యూహంతో వ్యవహరించారు. స్క్రూటినీ, ఉపసంహరణల ప్రక్రియ అనంతరం టౌన్‌బ్యాంక్ చైర్మన్‌గా నాదెళ్ల విద్యాసాగర్ ఎన్నిక దాదాపు ఖరారైనట్లే తెలుస్తోంది.

ఏఆర్ డీఎస్పీగా శ్రీనివాసులు

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయం ఏఆర్‌డీ ఎస్పీగా ఎం శ్రీనివాసులను నియమి స్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. శుక్రవారం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఏఆర్ డీఎస్పీ చిన్నకృష్ణ చిత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కటారు సుబ్బరామిరెడ్డి మృతి



కటారు సుబ్బరామిరెడ్డి (ఫైల్)

రాజంపేట : రాజంపేట పట్టణ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ కటారు సుబ్బరామిరెడ్డి (70) కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తుదిశ్వాస వదిలారు. ఆయన అంత్యక్రియలు శనివారం 10.35 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన సోదరుడు కటారుశేఖర్‌రెడ్డి తెలిపారు. కటారు మృతి పట్ల ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనరు కృష్ణారావుయాదవ్, మున్సిపాలిటి కో–ఆప్షన్‌సభ్యుడు రాముయాదవ్, కౌన్సిలర్ కూండ్లరమణారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

మదనపల్లె : తండ్రి మరణానికి కారకుడనే నెపంతో మామను హత్యచేసిన అల్లుడికి ఏడేళ్ల విచారణ అనంతరం మదనపల్లె రెండో అడిషనల్ జిల్లాకోర్టు జీవిత ఖైదు శిక్షను ఖరారుచేస్తూ జడ్జి అబ్రహాం తీర్పు నిచ్చారు. చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమంద గొల్లపల్లెకు చెందిన వెంకటసిద్దులు (63)ను 2017 ఆగస్టు 7వ తేదీన కలికిరి మండలం గుట్టపాళ్యం గొల్లపల్లె పొలాల వద్ద దారుణ హత్యకు గురయ్యాడు. తండ్రి హత్యపై వెంకటసిద్దులు కుమారుడు నాగరాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అప్పి సోమల ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ బాధ్యతను అప్పటి చౌడేపల్లె సీఐ రవీంద్రకు అప్పగించారు. పోలీసు విచారణలో వెంకటసిద్దులు అల్లుడు పి.సుధాకర (45)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసు విచారణలో అల్లుడు మామను హత్యచేసినట్లుగా నిర్ధారణ కావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఏడు సంవత్సరాల పాటు కేసు విచారణ మదనపల్లె రెండో అదనపు జిల్లా కోర్టులో జరిగింది. శుక్రవారం జిల్లా కోర్టు జడ్జి అబ్రహాం నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ రవీంద్ర, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, చౌడేపల్లె సీఐ రాంభూపాల్, సోమల ఎస్‌ఐ శివశంకర్, కోర్టు కానిస్టేబుల్ సునీల్‌కుమార్, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు అభినందించారు.

వీఆర్‌ఏను దూషించిన భూ ఆక్రమణ దారుడు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని ఇబ్రహీంపేటకు చెందిన సుధాకర్ అనే భూ ఆక్రమణ దారుడు తనను దూషించాడని పెన్నపేరూరు వీఆర్‌ఏ శాంత ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. మండల పరిధిలోని ఓబులేశు కోన సమీపాన సర్వే నెంబరు. 661లో ఉన్న ప్రభుత్వ భూమిని ఇబ్రహీమ్ పేటకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి అక్రమంగా చదును చేస్తున్నారన్న సమాచారం రావడంతో అడ్డగించేందుకు గంగపేరూరు వీఆర్‌ఏతో కలిసి వెళ్లినట్లు తెలిపింది. అంతలోనే సమాచారం అందుకున్న సుధాకర్ చదును చేస్తున్న ట్రాక్టర్‌తో సహా వెనుతిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. సుధాకర్ ఇంటికి వెళ్లి ఎవరూలేని సమయంలో ఇలా అక్రమంగా భూమిని చదును చేయడం చట్టపరంగా నేరమని చెప్పడంతో నోటికొచ్చినట్లు దూషించారని తెలిపింది. వీఆర్‌ఏ ఫిర్యాదును స్థానిక పోలీస్ స్టేషన్‌కు రెఫర్ చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు

– జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

రాజంపేట రూరల్ : జిల్లాలో అవసరమైన వ్యవసాయ రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందించనున్నట్లు జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి వై లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల పరిధిలోని ఆకేపాడు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం డివిజన్ రైతు సేవా కేంద్ర సిబ్బందికి, ఎంఐ కంపెనీ సిబ్బందికి బిందు, తుంపర సేద్య పరికరాల రిజిస్ట్రేషన్, ప్రాథమిక సర్వేలపై, పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వై.లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలు కావాల్సిన రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జీ సురేష్‌బాబు, ఎంఐ డీసీ చంద్ర, ఎంఐ ఇంజనీర్ గురుప్రసాద్, ఎంఐఏఓ నజీర్, రాజంపేట, నందలూరు,పెనగలూరు రైతు సేవా కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు

- అండర్–17 విభాగంలో 13 జిల్లాల నుంచి పాల్గొననున్న బాలికలు
- సిటీఎంలో క్రీడా మైదానాలు ఏర్పాటు



నెట్‌బాల్ ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

మదనపల్లె సిటీ : రాష్ట్ర స్థాయి అండర్–17 నెట్‌బాల్ బాలికల టోర్నమెంటు పోటీలు శనివారం నుంచి మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. ఏపీ పాఠశాల విద్య సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో 13 జిల్లాల నుంచి బాలికల జట్లు పాల్గొంటాయి. క్రీడాకారులతో పాటు కోచ్‌లు, మేనేజర్లు, పీడీలు వచ్చారు. వీరికి స్థానిక ఓ కళ్యాణ మండపంలో వసతులు ఏర్పాటు చేశారు.

క్రీడా పోటీలకు పటిష్ట ఏర్పాట్లు



మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అండర్–17 బాలికల నెట్‌బాల్ పోటీలు నిర్వహించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. క్రీడాకారులకు ప్రత్యేకంగా వసతి,భోజన ఏర్పాట్లు చేశాం. మూడు రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. – వసంత, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి

పనివేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి విరుద్ధం

ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ రెడ్డన్న

రాయచోటి (జగదాంబసెంటర్) : పాఠశాలల్లో పని వేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పిసి రెడ్డన్న అన్నారు. జిల్లా కేంద్రం రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పాఠశాలల సమయాన్ని మార్చాలనుకున్నపుడు మానసిక నిపుణుల అభిప్రాయం తీసుకోవాలని, ఇతర రాష్ట్రాలలో ఏ విధంగా పాఠశాలల బోధన సమయాలు ఉన్నాయో పరిశీలించాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలలోనే కాకుండా దేశంలో అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9–10 నిమిషాల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొన్ని పాఠశాలలు, 10 గంటల నుంచి 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలలో 7.30 గంటల నుంచి 1.30 గంటల వరకు నిర్వహిస్తున్నారన్నారు. విరామ సమయాన్ని తీస్తే అన్ని పాఠశాలల గరిష్ట పనివేళలు ఐదు గంటలు మాత్రమే అన్నారు. తమిళనాడులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.10 గంటల వరకు నిర్వహిస్తున్నారని, కర్ణాటక రాష్ట్రంలో 8 గంటల నుంచి 1.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 9.30 గంటల నుంచి 3.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనివేళలు పెంచడానికి గల కారణం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నాటుసారా, కర్ణాటక మద్యం స్వాధీనం



నాటుసారా, నిందితుడు బుక్కే రవినాయక్ అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె : మదనపల్లె ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో నాటుసారా, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ భీమలింగ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె మండలం మాలేపాడు క్రాస్‌లో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా, నారమాకుల తండాకు చెందిన బుక్కే రవినాయక్‌ను అరెస్ట్ చేసి 190 లీటర్ల నాటుసారా, తరలిస్తున్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు.. సారా కొనుగోలు చేస్తున్న నక్కలదిన్నె తండాకు చెందిన బుక్కే పద్మావతిని ఇదే కేసులో రెండో ముద్దాయిగా చేర్చామన్నారు. నిందితురాలు పరారీలో ఉండటంతో గాలిస్తున్నట్లు తెలిపారు. కురబలకోట మండలం తెట్టు గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జి.అనూరాధను అరెస్టుచేసి, 76 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు డార్కస్, జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు రంగానాయక్, మహమ్మద్‌అలీ, కానిస్టేబుళ్లు మణి, మధు, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

పచ్చని పల్లెల్లో రెడ్‌బుక్ విష సంస్కృతి

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు
- ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ గంగులమ్మను పరామర్శిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : ప్రశాంతతకు మారుపేరైన పచ్చని పల్లెల్లో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ పేరుతో విష సంస్కృతిని వ్యాపింపచేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి, మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంకిశెట్టిపల్లెకు చెందిన గంగులమ్మ, బాలకృష్ణలను శుక్రవారం ఆయన పరామర్శించారు. దాడికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, భయపడాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు. అకారణంగా దాడికి పాల్పడి వైఎస్సార్ సీపీ నాయకులను గాయపరిచిన వారిపై కేసులు నమోదుచేసి అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...టీడీపీ ప్రభుత్వ పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు అధికమయ్యాయన్నారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదన్న వాస్తవాన్ని టీడీపీ నాయకులు గ్రహించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు.

తహసీల్దార్, వీఆర్‌ఓపై కేసు నమోదు

తంబళ్లపల్లె : భూమి ఆన్‌లైన్, వన్‌బీ, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేశారని గతంలో పని చేసిన తహసీల్దార్, వీఆర్‌ఓపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి కథనం మేరకు ...గోపిదిన్నె పంచాయతీ జిల్లావారిపల్లెకు చెందిన కె.మల్‌రెడ్డి టీఎస్ శ్యామలమ్మ వద్ద 606 సర్వే నంబర్‌లో 75 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. మల్‌రెడ్డి 2014లో మృతి చెందాడు. ఆ భూమిని గతంలో పని చేసిన తహసీల్దార్ సి.కె.శ్రీనివాసులు అప్పటి గోపిదిన్నె వీఆర్‌ఓ విశ్వంభర్‌నాయుడు ఆ భూమిలోని సబ్‌డివిజన్ చేసి 606/జె 1 సర్వే నంబర్‌తో అదే గ్రామంలోని బంధువైన వి.శివారెడ్డి పేరుతో ఆన్‌లైన్ చేసి వన్‌బీ, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేశారని మల్‌రెడ్డి కుమారుడు రెడ్డిశేఖర్‌రెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు దీనిపై విచారించాలని పోలీసులకు ఉత్వర్వులు ఇచ్చింది. మల్‌రెడ్డి కుటుంబీకుల అనుమతి లేకుండా తహసీల్దార్, వీఆర్‌ఓ ఏకపక్ష నిర్ణయాలతో వన్‌బీ, పాసుబుక్ మంజూరు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ ఫిర్యాదు మేరకు ఈనెల 5న ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.